ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 22 జూలై 2024







ఆత్మకూరులో సాయినాథుని రథోత్సవ శోభ





ఎన్‌కెరోడ్డులోని సాయిబాబాగుడిలోని దత్తాత్రేయునికి హారతి ఇస్తున్న అర్చకులు

ఘనంగా గురుపౌర్ణమి

సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 21: జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచి రాత్రిదాకా ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో సాయి సత్యవ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పల్లకి సేవల్లో భక్తులు భారీగా తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా రథోత్సవం శోభాయమానంగా సాగింది. సాయిబాబా ఆలయం నుంచి మార్కెట్‌యార్డు వీధి, కేజీరోడ్డు మీదుగా వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి తిరిగి సాయిబాబా ఆలయం వరకు మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం సాగింది.







ఆత్మకూరులో అలంకరణలో సాయినాథుడు






ముత్యాలపాడు చెరువులో పెరిగిన రబ్బరు చెట్లు

చెరువులకు వైసీపీ చేటు

చెరువుల కింద సేద్యం సంక్షోభంలో పడిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల చెరువుల్లో చుక్క నీరు నిలబడటం లేదు. ఉపాధి హామీ నిధులతో నామమాత్రంగా పనులు చేసి వదిలేస్తున్నారు. నీరున్న చోట పంట కాలువలు లేవు. ఫలితంగా పొలాలు బీడుపడిపోతున్నాయి. వైసీపీ పాలనలో నిధులు మంజూరు కాకపోవడంతో చెరువుల, పంట కాలువల మరమ్మతు పనులు చేయలేదు. కేవలం ప్రతిపాదనలతోనే సరి పెట్టారు.

- మరమ్మతులకు నిధులు ఇవ్వని గత ప్రభుత్వం
- ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- చుక్కనీరు నీరు నిలవడం లేదని రైతుల ఆందోళన
- పెద్ద ఎత్తున ఆక్రమణలో చెరువులు
- అమృతసరోవర్ నిధులు దుర్వినియోగం
- శిథిలావస్థలో పంట కాలువలు

చాగలమర్రి, జూలై 21: నంద్యాల పార్లమెంట్ పరిధిలో 25 మండలాల్లో 262 చెరువులు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 109, పంచాయతీరాజ్ పరిధిలో 153 చెరువులు ఉన్నాయి. ఈ ఏడాది చెరువులకు నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో చిన్న, పెద్ద చెరువులు 50 వరకు ఉన్నాయి. ఆళ్లగడ్డ, రుద్రవరం, శిరివెళ్ల, చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, సంజామల, వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లె, జూపాడు బంగ్లా, మిడ్తూరు మండలాల్లో 31,243 హెక్టార్ల ఆయకట్టు ఉంది. బండి ఆత్మకూరు మండలంలో 12 చెరువుల కింద 3,951.93 ఎకరాల ఆయకట్టు ఉంది. మహానంది మండలంలో 6 చెరువుల ఉండగా 1892.41 ఎకరాల ఆయకట్టు ఉంది. పాణ్యం, బనగానపల్లె, అవుకు మండలాల్లో 21 చెరువుల కింద 7,914 .31 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. 2018-19లో చెరువుల మరమ్మతులకు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ముత్యాలపాడు చెరువుకు రూ.4 కోట్లు, డి. వనిపెంట చెరువు అలుగు మరమ్మతులకు రూ. కోటి పనులు చేశారు. నామమాత్రంగా పనులు చేశారన్న విమర్శలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమై 40 రోజులు అవుతున్నా ఆశించిన వర్షాలు కురవక పోవడంతో చెరువులకు నీరు అందలేదు ఆయకట్టు సాగు ఇబ్బందిగా మారింది.



డి.వనిపెంట చెరువు పరిధిలో ఆక్రమణకు గురైన భూములు

● శిథిలావస్థలో పంట కాలువలు నంద్యాల జిల్లా పరిధిలో చెరువుల కింద పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పంట కాలువలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ముళ్ల కంపలు నిండుకొని చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ప్రతి ఏడాది చెరువులకు మాత్రమే నామమాత్రంగా పనులు చేసి వదిలేస్తున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో 29 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద పంట కాలువలు, తూములు సరిగా లేకపోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల కిందగల పంట కాలువల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వంలోనైన చెరువులు, పంట కాలువల మరమ్మతు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకొని ముత్యాలపాడు చెరువు

పట్టించుకోవడం లేదు



చెరువుల మరమ్మతుల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఉపాధి కూలీలచే నామమాత్రంగా పనులు చేసి వదిలేస్తున్నారు. నిధులు దుర్వినియోగం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. పంట కాలువలు సరిగా లేక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. చెరువుల మరమ్మతులు చేపట్టి నీరందేలా చూడాలి.

-అక్కిరెడ్డి, రైతు, ముత్యాలపాడు

ప్రతిపాదనలకే పరిమితం

చెరువుల మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలతోనే సరిపోయింది. 2018-19లో నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులకు రూ.20 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు చేశాం. అయితే నిధులు మంజూరు కాలేదు. ఐదేళ్ల నుంచి నిధులు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. చెరువుల ఆక్రమణ వాస్తవమే. రెవెన్యూశాఖ సహకారం అవసరం. ఆక్రమణలను అడ్డుకునేందుకు చెరువుల కొలతలను పూర్తి చేసి హద్దులను సూచిస్తే హద్దురాళ్లు పాతేందుకు సిద్ధంగా ఉన్నాం. చెరువుల ద్వార రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా చూస్తాం.

- మునాఫ్, ఏఈ, చిన్న నీటిపారుదల శాఖ, ఆళ్లగడ్డ

తగ్గిన భూగర్భజలాలు

సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు తగ్గాయి. బోరుబావుల కింద నీరు తగ్గింది. బావులు పూర్తిస్థాయిలో నీటి మట్టం తగ్గిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువుల్లో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు ఎప్పుడు లేని విధంగా ఉన్నాయి. వర్షాలు కురిసి చెరువులు నిండితే వరి సాగు చేసేందుకు వీలవుతుందని రైతులు చెబుతున్నారు.

చెరువుల మరమ్మతు పనులు చేపట్టాలి



గ్రామాల్లోని చెరువులు, పంట కాలువల మరమ్మతు పనులు చేపట్టాలి. వైసీపీ ప్రభుత్వంలో చెరువుల మరమ్మతు గురించి పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే పనులు చేసి చేతులు దులుపుకున్నారు. డి. వనిపెంట అలుగు సమీపంలో చెరువు భూమి ఆక్రమణకు గురైంది. చెరువుల ఆక్రమణ గురించి రెవెన్యూ అధికారులు చెరువుల ఆక్రమణ గురించి పట్టించుకోవాలి. కొత్త ప్రభుత్వంలోనైనా చెరువులు, కాలువల పనులు చేపట్టాలి.

-గోపాల్, రైతు, డి. వనిపెంట

ఆక్రమణలో చెరువులు

నియోజకవర్గంలో చిన్న, పెద్ద చెరువులు 50 దాకా ఉన్నాయి. వీటిలో చాలా ఆక్రమణకు గురయ్యాయి. ఆక్రమణదారులు చెరువులను పూడ్చి వేసి భూములుగా మార్చుకుంటున్నారు. ఇది ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాగలమర్రి మండలంలోని డి. వనిపెంట, ముత్యాలపాడు, తిప్పనపల్లె, చింతలచెరువు గ్రామాల్లోగల చెరువులు ఆక్రమించుకొని భూములుసాగు చేసుకుంటున్నారు. రుద్రవరం, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, ఉయ్యాలవాడ మండలాల్లోని చెరువులు ఆక్రమణకు గురి కావడంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. ఆయకట్టుకు నీరందించలేకపోతున్నాయి. చెరువుల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు సర్వే జరిపితే వాస్తవాలు వెలుగు చూస్తాయి. చెరువుల కొలతలు పూర్తి చేసి హద్దులను సూచిస్తే చెరువు ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది.

అమృతసరోవర్ నిధులు దుర్వినియోగం

చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, తిప్పనపల్లె చెరువుల్లో 2022-23 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అమృతసరోవర్ పథకం ద్వార ఉపాధి కూలీలచే చెరువు మరమ్మతు పనులు చేశారు. చెరువుల్లో పూడికతీత, రబ్బరు చెట్ల తొలగింపు సక్రమంగా చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. ముత్యాలపాడు చెరువు రూ.8.43 లక్షలు ఖర్చు చేశారు. తిప్పనపల్లె చెరువు కింద రూ.3.70 లక్షలు ఖర్చు చేసి చెరువు పూడికతీత పనులు చేశారు. నామమాత్రంగా కూలీలచే పనులు చేయించి నిధులు దుర్వినియోగం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ పనులపై అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కూలీల మస్టర్‌లో కూడా చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై ఏపీవో నిర్మలను వివరణ కోరగా అమృతసరోవర్ నిధులతో రెండు చెరువుల్లో ఉపాధి కూలీలచే పూడికతీత పనులు చేశామని అన్నారు. మస్టర్ల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు లేవని పేర్కొన్నారు. పనులకు వచ్చిన కూలీలకు మాత్రమే మస్టర్లు వేశామని అన్నారు.



డి.వనిపెంట చెరువు వద్ద బీటలు వారిన అలుగు

శాకంబరి అలంకరణలో భ్రామరి

వివిధ రకాల కూరగాయలతో దర్శనమిచ్చిన అమ్మవారు



శాకంబరి అలంకరణలో అమ్మవారు

శ్రీశైలం, జూలై 21: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని భ్రమరాంబాదేవి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా అర్చకులు, వేదపండితులు లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠిస్తూ మహాగణతికి పూజలు నిర్వ హించారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పలు రకాలు ఫలాలతో భ్రమరాంబ అమ్మవారి మూలమూర్తి, ఉత్సవ మూర్తి, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరీ అమ్మవారికి, గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవా రికి ప్రత్యేక శాకాలంకరణ చేశారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణాన్ని సైతం సుందరంగా అలంకరించారు.



క్యూలో నిల్చున్న భక్తులు

నేడు ప్రజా ఫిర్యాదుల

పరిష్కార వేదిక

నంద్యాల (కల్చరల్), జూలై 21: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఉదయం 9:30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

సాగునీటి అంశాలపై తీర్మానాలు హర్షణీయం: బొజ్జా

నంద్యాల టౌన్, జూలై 21 : గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించడం పట్ల రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ తీర్మానాలు సత్వరం అమలయ్యేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 2016లో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టడాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆహ్వానించిందని బొజ్జా గుర్తు చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా డెల్టాకు ఇవ్వాల్సిన 80 టీఎంసీల కృష్ణా జలాలకు బదులుగా గోదావరి జలాలను అందించే లక్ష్యంతో పట్టిసీమ ఎత్తిపోతల నిర్మాణం చేపట్టారని బొజ్జా పేర్కొన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు శ్రీశైలం ప్రాజెక్టుతో అనుబంధం తెగిపోయిందని పేర్కొన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా డెల్టాకు ఇక ఏ మాత్రం నీటిని విడుదల చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ విధంగా ఆదా అయిన 80 టీఎంసీల కృష్ణా జలాలను శ్రీశైలం రిజర్వాయర్‌లో నిలువ ఉంచి రాయలసీమ ప్రాజెక్టులకు వినియోగించాలన్నారు. దీని కోసం శ్రీశైలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 854 అడుగులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ పనులు చేయకుండా పట్టిసీమ ద్వారా రాయలసీమకు లబ్ధి చేకూరుతుందని అంటే అది కేవలం ఒట్టిమాటలుగా మిగిలిపోతుందని అన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి ఆకాంక్షించే ప్రజాప్రతినిధులందరూ ఈ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి శ్రీశైలం జలాశయంలో రాయలసీమ నీటి హక్కులను కాపాడే విధానాలను అమలు పరిచేలాగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి విజ్ఞప్తి చేస్తోందని బొజ్జా అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా వెనకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ నిధుల సాధన కోసం రాయలసీమ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రాయలసీమ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గళమెత్తాలి.. నిధులు రాబట్టాలి..!

- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల పడకేసిన ప్రగతి
- పురోగతి లేని సాగునీటి ప్రాజెక్టులు
- నిరుపయోగంగా టిడ్కో గృహాలు
- కందనవోలు ముంగిట సమస్యలు ఎన్నో
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



కర్నూలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి)

సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 21న తొలిసారిగా సమావేశమైంది. ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. నేటి నుంచి ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అమరావతికి చేరుకున్నారు. ఎమ్మిగనూరు బీవీ జయనాగేశ్వరరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మినహా కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలు మంత్రి టీజీ భరత్, బొగ్గల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పార్థసారథి, బి.విరుపాక్షి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి పడకేసింది. సాగునీటి ప్రాజెక్టులు గతితప్పాయి. రూ.వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన టిడ్కో ఇళ్లు నిరుపయోగంగా వదిలేశారు. ఇంటింటికి కుళాయి ఇవ్వాలనే లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్‌ను అక్రమాల పుట్టగా మార్చేశారు. పల్లెసీమ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. వైద్యం అందని ద్రాక్షగా తయారైంది. జగనన్న కాలనీలు జగమొండి కాలనీలుగా మరాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో. జిల్లా ప్రగతి కోసం ఎమ్మెల్యేలు గళం విప్పాలి.. సీఎం చంద్రబాబును ఒప్పించి నిధులు రాబట్టాలి. కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు జిల్లా కోసం పోరాడి చర్చల్లో మమేకం కావాలి. మొత్తంగా జిల్లా ప్రగతికి భారీగా నిధులు రాబట్టాల్సిన బాధ్యతను ప్రజాప్రతినిధులు సమష్టిగా తీసుకోవాలి. నేటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు అందుకు వేదికవ్వాలి.

ప్రాజెక్టులకు జీవం రావాలి..

జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి కోసం వేదవతి ప్రాజెక్టుకు రూ.1,942.38 కోట్లు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా ఆర్డీఎస్ కుడి కాలువకు రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు ఇచ్చారు. టెండర్లు పూర్తి పనులు కూడా మొదలు పెట్టారు. తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 21న రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ నం.154 జారీ చేశారు. వైసీపీ వచ్చాక అటకెక్కాయి. గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు ఐదేళ్లుగా నిర్వహణ నిధులు పైసా ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు, వెలుగోడు జలాశయం మరమ్మతులకు డ్రిప్-2 కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా చెల్లించక నిధులు కాలేదు. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరిట రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు ఎక్కడికక్కడే ఆగిపోయింది. తెలుగుగంగ, ఎస్సార్బీసీ కాలువ ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఉంది.

జల్‌జీవన్ మిషన్‌పై వాణి వినిపించాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయి ఇవ్వాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ అమలు చేస్తుంది. కర్నూలు జిల్లాలో రూ.197.76 కోట్లతో 1,026 పనులకు అనుమతులు ఇచ్చారు. 465 పనులు చేపడితే 293 పనులు పూర్తి కాగా.. 79 పనులు పురోగతిలో ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ.115.80 కోట్లతో 522 పనులకు పరిపాలన అనుమతులు వస్తే.. 416 పనులు చేపట్టారు. 232 పూర్తి చేయగా 152 పనులు పురోగతిలో ఉన్నాయి. అంటే.. ఉమ్మడి జిల్లాలో రూ.313.56 కోట్లతో 1,548 పనులకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే.. 881 పనులే చేపట్టారు. అందులో పూర్తయినవి 525 పనులే. అంటే.. ఏళ్లు గడిచినా 1,023 పనులు మొదలే పెట్టలేదు. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వదనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేకపోయారు. చేసిన పనుల్లో కూడా అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కర్నూలు నగరం, ఎమ్మిగనూరు, కోడుమూరు పట్టణాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీటి పైపులైన్ పనులకు నిధులు రాబట్టే దిశగా ఎమ్మెల్యేలు గళమెత్తాలి.

గుంతల రోడ్లు

ఉమ్మడి జిల్లాలో 13 ప్రధాన రోడ్లు 157.060 కిలోమీటర్లు పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) రూ.323.59 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆదోని మండలం ఢాణాపురం క్రాస్ - హొళగుంద వయా హెబ్బటం ప్రధాన రహదారి 25.490 కి.మీలు ఆధునికీకరణకు ఎన్‌డీబీ నిధులు రూ.59.25 కోట్లు, కోడుమూడు-వెల్దుర్తి వయా గోరంట్ల రోడ్డు 3.00 కి.మీల నుంచి 14.500 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణకు రూ.21.09 కోట్లు, ఎమ్మిగనూరు-మాలపల్లి రోడ్డు 0/00 నుంచి 11.885 కి.మీలకు రూ.24.15 కోట్లు మంజూరు, ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డు (ఏజీ రోడ్డు) - పెద్దకడబూరు రోడ్డు 0/00 నుంచి 13.750 కిలో మీటర్ల వరకు ఆధునికీకరణకు ఎన్‌డీబీ నిధులు రూ.24.61 కోట్లు నిధులు ఇస్తే ఇక్కడ కూడా పనులు మొదలు పెట్టలేదు. వీటిపై ప్రజాప్రతినిదులు దృష్టి సారించాలి.

- కర్నూలు సర్వజన వైద్యశాలలో రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా స్టేట్ క్యాన్సర్ యూనిట్ రూ.160 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలోనే చేపడితే.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లలో భవనం మాత్రమే పూర్తి చేశారు. క్యాన్సర్ చికిత్సకు కీలకమైన లీనియర్ యాగ్జిలేటర్ (రోగి క్యాన్సర్ గుర్తించి రేడియేషన్ ట్రీట్మెంట్) వేనియర్ మిషన్లు, బ్రాకి థెరపీ, సిటీ సిమిలేర్, వెట్ సిటీ స్కాన్, ఎక్స్ రే, ఎంఆర్ఐ.. వంటి అత్యాధునిక యంత్రాలు సమకూర్చలేదు.
- కర్నూలు, ఆదోని మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే.. ఎమ్మిగనూరులో రూ.12.60 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆస్పత్రి అసంపూర్తిగా ఉంది. వాటిని పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
- కర్నూలు నగరానికి సుంకేసుల డ్యాం నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు అందించేందుకు అమృత్-2.0 కింద రూ.135 కోట్లతో పైపులైన్, పంపింగ్ స్టేషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయాలి. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ నిర్మాణం కోసం కృషి చేయాలి.
- కోడుమూరు 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరు (సీహెచ్‌సీ)ని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి. అదనపు భవనాలు, వైద్యులను నియమించాలి.
- ఆలూరు నియోజకవర్గంలో హొళగుంద, హాలహర్వి మండలాల్లో 30 ఏళ్ల క్రితం ఆనాటి జనాభాకు అనుగుణంగా ఎస్ఎస్ ట్యాంకులు, పైపులైన్లు వేశారు. జానాభా పెరగడం, పైపులైన్లు లీకేజీలు వల్ల తాగునీరు అందడం లేదు. ఈ పథకాలు ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి.
- ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని పట్టణాలు, సమీప గ్రామాల్లో చేనేత కుటుంబాలు 45 వేలకు పైగా ఉన్నారు. వారిలో చేనేత వృత్తిపై ఆధారపడిన చేనేతలు 25 వేలకు పైగా ఉన్నారు. వీరికి గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందించాలి. అలాగే.. వీరికి ఉపాధి కల్పించే మాస్టర్ వీవర్స్‌కు గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల్లో రాయితీ రుణాలు అందివ్వాలి.

పేదలకు టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి

పట్టణ పేదలకు గూడు-నీడ కల్పించాలనే సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఏపీ టిడ్కో ఇళ్లు నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ఇళ్లకు ఆ పార్టీ జెండాను పోలిన రంగులు వేసి వదిలేశారు. పేదలకు పంపిణీ చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కర్నూలు శివారులో జగన్నాథగట్టు వద్ద 10 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టి 9,185 ఇళ్లు పూర్తి చేశారు. ఆదోని పట్టణం సిరుగుంప సర్కిల్ సమీపంలో 4,704 ఇళ్లు చేపట్టి 3,800 పూర్తి చేశారు. ఎమ్మిగనూరు పట్టణం శివన్న నగర్, మైనార్టీ కాలనీల్లో 3,250 ఇళ్లు చేపట్టి 3,164 ఇళ్లు పూర్తి చేశారు. నంద్యాల పట్టణం ఎస్సార్బీసీ కాలనీలో 10 వేల ఇళ్లు చేపట్టి 5,075 ఇళ్లు పూర్తి చేశారు. అంటే ఈ రోజుకు 21,300 టిడ్కో ఇళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నా.. చంద్రబాబుకు పేరు వస్తుందని గత జగన్ ప్రభుత్వం పేదలకు ఇవ్వలేదు. వాటిపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.


నిరుపయోగంగా టిడ్కో ఇళ్లు

వైద్య సదుపాయాలు లేని స్టేట్ క్యాన్సర్ యూనిట్


మహిళలను మోసం చేసిన బీహార్ దొంగలు

- వెండి కడియాలకు, పట్టీలకు మెరుగులు దిద్దుతామని..
- దొంగలకు దేహశుద్ధి చేసిన గ్రామస్థులు


దొంగల చేతిలో మోసపోయిన గ్రామస్థులు

కోసిగి, జూలై 21: చింతకుంటలో బీహార్ దొంగలు మహిళల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని వారు కాళ్లకు వేసుకున్న వెండి కడియాలు, పట్టీలకు మెరుగులు దిద్దుతామని మోసం చేయబోయి దొరికిపోయారు. ఆదివారం గ్రామానికి వచ్చిన బీహార్ వ్యక్తులు నర్సప్ప గారి లక్ష్మక్క, రాగిపాటి భీమక్క, కల్లుకుంట తాయమ్మ, మునిస్వామిల వెండి కడియాలు, కాళ్ల పట్టీలు సుమారు 80 తులాల దాకా తీసుకొని మెరుగులు దిదుతామని చెప్పారు. వారు పెద్ద బ్యాగులలో కెమికల్, యాసిడ్, పౌడర్‌లను పెట్టకొని మహిళలకు తెలియకుండా వెండిని కరిగించారు. వెండి బరువు తగ్గడంతో గ్రామస్థులు మహిళలు దొంగలను కాళ్లు చేతులకు తాళ్లు కట్టి దేహశుద్ధి చేశారు. బీహార్‌కు చెందిన గోపాల్ కుమార్ గుప్త, అఖిలేష్ కుమార్ గుప్త, అభిలాష్ గుప్తలను కోసిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.


బకెట్‌లో కెమికల్ తో కరిగించిన వెండి


దొంగలను తాళ్లతో కట్టివేసిన గ్రామస్థులు

దూదేకుల సంఘం చేయూత


చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా

హాలహర్వి, జూలై 21: తల్లిదండ్రులు లేక అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు దూదేకుల సంఘం తమవంతు సహకారం అందించింది. హాలహర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఆసాబి, సబియ, ఆఫ్రిన్‌లను నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఇతర నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ25వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ గూళ్యం గ్రామానికి చెందిన కాశీంసాబ్, షేకమ్మలు అనారోగ్యంతో చనిపోయారన్నారు. దీంతో వారి కుమార్తెలు ముగ్గురు అనాథలుగా మిగిలారన్నారు. ఎనిమిదేళ్లలోపు వయసున్న ఆ చిన్నారులకు దూదేకుల సంఘం అండగా ఉంటుందని వారి చదువుతోపాటు భవిష్యత్తుకు తమవంతు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వంతో పాటు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్ భాషా, ఇమామ్ కాశీం, సిద్దయ్య, మస్తాన్, మాబాషా, వలిసాబ్, షేక్షావలి, హుస్సేన్ సాబ్, టీపీ సాయి, బడేసాబ్, హుస్సేన్ పీరా, ఎల్లప్ప బసవరాజ్ తదితరులు ఉన్నారు.

శోకసంద్రంలో జూనూతల

- ప్రభుత్వలాంఛనాలతో జవాన్ వెంకటేశ్వర్లు అంత్యక్రియలు
- వందలాదిగా తరలివచ్చిన అభిమానులు, గ్రామస్థులు

అవుకు, జూలై 21: విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు గన్ మిస్‌ఫైర్ అయి మృతి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ పెట్నికోట వెంకటేశ్వర్లు అంత్యక్రియలు ఆదివారం అధికార లాంఛనాలతో ముగిశాయి. స్వగ్రామం అవుకు మండలంలోని జూనూతల గ్రామంలో అశ్రునయనాల నడుమ వెంకటేశ్వర్లు అంతిమయాత్ర సాగింది. ఆయన్ను కడసారి చూసేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున జూనూతల గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామం మొత్తం ఆదివారం శోక సంద్రంలో మునిగిపోయింది. దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో 2012లో వెంకటేశ్వర్లు సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. 2022 వరకు ఢిల్లీలో విధులు నిర్వర్తించాడు. గత ఏడాది తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువు మండలం బీడీఎల్ టౌన్‌షిప్‌కు వచ్చి బీడీఎల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 19తేదీన విధులకు వెళ్లి 20వతేదీ ఉదయం సీఐఎస్ఎఫ్ వాహనంలో బీడీఎల్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని బస్సు దిగుతున్న క్రమంలో చేతిలోని తుపాకీ ప్రమాదవశాత్తు పేలింది. బుల్లెట్ గడ్డం కింది నుంచి తలలోకి దూసుకెళ్లటంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ వాహనంలో ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటలకు బీడీఎల్ ఎస్ఐ డీఎస్ రవి జూనూతల గ్రామానికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో తల్లిదండ్రులతో పాటు భార్య రోదన కలచివేసింది. రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ జవాన్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. జవాన్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.


జవాన్‌కు నివాళులర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ


జవాన్ పార్థిక దేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ప్రముఖుల నివాళి

జవాన్ కుటంబానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ జవాన్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీడీఎల్ ఎస్ఐ డీఎస్ రవి, అవుకు తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేష్, శ్రీరామ, వెంకటేశ్వర్లు, ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్‌తో పాటు గ్రామ ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. సీఐఎస్ఎఫ్ అధికారులు పంపిన సంతాప పత్రాన్ని బీడీఎల్ ఎస్ఐ రవి జవాన్ తండ్రి వెంకటస్వామికి అందించారు. అనంతరం వైకుంఠ రథంపై జవాన్ పార్థివదేహాన్ని ఉంచి శ్మశాన వాటికకు తీసుకెళ్లి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు.


తల్లితో చిన్నారులు


రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

కొడుకు మృతిని జీర్ణించుకోలేకపోతున్నా



ఒక్కగానొక్క కొడుకు కావటంతో అల్లారుముద్దుగా పెంచుకున్నాం. మేము కూలీ పనులకు పోతున్నా కొడుకు మాలాగా కష్టపడకూడదని చదివించాం. ప్రయోజకుడైన తరుణంలో దేవుడు మా తలరాతలు ఇలా రాస్తాడని అనుకోలేదు. కోడలు, మనుమడు, మనుమరాలిని చూస్తే గుండె తరుక్కుపోతోంది.

- లక్ష్మీదేవి, జవాన్ తల్లి, జూనూతల

ఏ తండ్రికీ ఇంతటి కష్టం రాకూడదు



ఇలాంటి కష్టం ఏ తండ్రికీ రాకూడదని దేవున్ని కోరుకుంటున్నా. కొడుకు జీవితం సజావుగా సాగుతున్న తరుణంలో ఇలాంటి విషయం వినాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. విధి ఆడుతున్న నాటకంలో పావులుగా ఉండిపోవాల్సి వస్తుంది తప్ప చేసేదేమీ లేదు.

- వెంకటస్వామి, జవాన్ తండ్రి, జూనూతల

అప్పుల బాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం

ఎమ్మిగనూరు రూరల్/వెల్దుర్తి, జూలై 21: చేసిన అప్పులు తీర్చలేక ఉమ్మడి జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఎమ్మిగనూరు మండలంలో బోయ గుడిసె రంగన్న(39), వెల్దుర్తి మండలంలో మద్దిలేటి(48) అనే రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎమ్మిగనూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రంగన్న తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తిపంటను సాగు చేశాడు. పంట సాగు కోసం పలుచోట్ల రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా కనీసం పెట్టుబడి కూడా రాకుండా నష్టపోయాడు. ఇదే సమయంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో ఏమీ చేయలేని స్థితిలో రంగన్న సొంత పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. రైతుకు భార్య లక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తె సంతానం.


రంగన్న (ఫైల్)

- వెల్దుర్తి మండలంలోని పుల్లగుమ్మి గ్రామానికి చెందిన వడ్డె మద్దిలేటి తనకున్న 5 ఎకరాల్లో పలు రకాల పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ.6 లక్షల దాకా అప్పులు చేశాడు. మూడేళ్లుగా పంటలు పండక, అప్పులు తీర్చలేక నిత్యం మదనపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్దిలేటి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

పెద్దపాడు బీసీ హాస్టల్ వార్డెన్‌పై వేటు

సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

కర్నూలు ఎడ్యుకేషన్, 21: కల్లూరు మండలంలోని పెద్దపాడు బీసీ హాస్టల్ వార్డెన్ పి.సత్యనారాయణ రాజుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టల్ వార్డెన్ పి. సత్యనారాయణరాజు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించడం లేదని ఇటీవలి కాలంలో ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా అలాగే హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచడం లేదని, విద్యార్థులకు వార్డెన్ అందుబాటులో లేడంటూ తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై త్రీమెన్ కమిటీతో విచారణ చేపట్టాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో విచారణ చేపట్టి పూర్తిస్థాయిలో నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ వార్డెన్ సత్యనారాయణరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వివాహిత ఆత్మహత్య

నందికొట్కూరు, జూలై 21: అత్తారింటి బాధలు తట్టుకోలేక ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు గురైన సంఘటన నందికొట్కూరు పట్టణంలోని లింగం వీధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వివరాలు.. నందికొట్కూరుకు చెందిన షేక్ హుస్సేన్‌తో బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన మాసూంబాషా కుమార్తె సాహేరాబాను(25)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 8 నెలల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో సాహేరాబాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారకులు ఆమె భర్త షేక్ హుస్సేన్, అతడి తండ్రి వలి, తల్లి షేక్ వహిద, ఆడపడుచు షేక్ రిజ్వానా, మరిది సాదిక్ కారణమంటూ మృతురాలి తండ్రి మసూంబాషా ఆరోపిస్తున్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందికొట్కూరు పోలీసులు వెల్లడించారు.

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి చీర



అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 21: నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించుకుంటారు. ఆదివారం ఆషాడమాసం సందర్భంగా జగజ్జననీ అమ్మవారికి బనగానపల్లె, రేవనూరు, నరసారావుపేట, జమ్మలమడుగు, హైదరాబాదు, గార్గేయపురం, కర్నూలు, ఆలూరు, చెన్నై, శాంతినగర్, మదనపల్లి నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకొని వచ్చి సమర్పించారు. జగజ్జననీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

గంగమ్మకు బోనాలు



కౌలూరులో గంగాదేవికి పూజలు నిర్వహిస్తున్న రజకులు

పాణ్యం, జూలై 21: మండలంలోని కౌలూరు గ్రామంలో రజకుల ఆధ్వర్యంలో ఆదివారం గంగాదేవి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు గ్రామం నుంచి గంగమ్మ ఆలయం వరకు బోనాలు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం నైవేద్యాది పూజలు నిర్వహించారు. వర్షం కోసం ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా, మండల రజక సంఘం కన్వీనర్లు కొర్రపోలు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ వర్షం కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో కౌలూరులోని గంగాదేవి విగ్రహానికి దాదాపు వంద యేళ్ల నుంచి రజకుల ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయని, దేవదాయశాఖ అధికారులు ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. రజక సంఘం గౌరవాధ్యక్షులు చిన్న శ్రీనివాసులు, రామకృష్ణ, మద్దిలేటి పాల్గొన్నారు.

స్తంభంపై నుంచి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు

పాణ్యం, జూలై 21: మండలంలోని పిన్నాపురం సమీపంలో ఆదివారం విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు పడి పోల్ టు పోల్ కార్మికుడికి తీవ్ర గాయాలైనట్లు విద్యుత్ శాఖ ఏఈ పుల్లయ్య తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పోల్‌టుపోల్ కార్మికుడుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు పిన్నాపురంలో విద్యుత్ స్తంభం ఎక్కి విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో తలకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. కార్మికుడిని హుటాహుటిన నంద్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

'నిందితులను అరెస్టు చేయాలి'



పాములపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పాములపాడు, జూలై 21: మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి లింగస్వామిని హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రజక సంఘం దోభి మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాములు, మాల మహానాడు నాయకులు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం లింగస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. పాములపాడులోని పూలే విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి రూ. 25 లక్షల ఆర్థిక సాయం, ఐదెకరాల భూమి, పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రజక సంఘం నాయకులు, జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, బస్తిపాటి మౌళాలి, నాగభూషణం, రామంజనేయులు, ధర్మయ్య, రామకృష్ణ, మద్దిలేటి, లింగస్వామి, మధు, లింగమూర్తి, చిన్న మద్దిలేటి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం'

నంద్యాల (నూనెపల్లె), జూలై 21: గత 33 సంవత్సరాలుగా వైద్య శిబిరాలను ఏర్పాటును కొనసాగించడం అభినందనీయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాలలో మధుమణి నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫిరోజ్ హాజరై ప్రారంభించారు. వారం రోజుల్లో రూ 50 లక్షల విలువ చేసే వందకు పైగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ నాగమణి, డాక్టర్ మణిదీప్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రారావు, కౌన్సిలర్ శ్యాం సుందర్‌లాల్, ఐఎంఏ నంద్యాల శాఖ ప్రతినిధులు వైద్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'సమగ్ర వేతన చట్టం తీసుకురావాలి'

గడివేముల, జూలై 21: అసంఘటిత రంగ కార్మికులైన హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, చిన్న వ్యాపారస్థులు, ఆటో, లారీ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకొని రావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న రవాణా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 106(1) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. హమాలీ కార్మికులకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బాలు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 21: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని 42 వార్డులో వార్డు ఇన్‌చార్జి, నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పిల్లి వెంకట్ ఆధ్వర్యంలో వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు, శేఖర్, పిల్లి శేఖర్, మణి, అశోక్ నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో వర్షం

ఆత్మకూరు, జూలై 21: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా గత కొన్నిరోజులుగా ఆత్మకూరు ప్రాంతంలో అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. ఈక్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కొంతసేపు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. పలు కాలనీల్లో ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. తిక్కయ్యస్వామి దర్గా వద్ద కాల్వల్లోని మురుగు వర్షపునీటితో కలిసి రోడ్లపై నిలిచిపోవడంతో ఆ ప్రదేశమంతా దుర్వాసన వెదజల్లింది. అదేవిధంగా పట్టణ శివార్లలోని భవనాశి, పడేవాగులు కూడా ఉధృతంగా ప్రవహించాయి.

వైభవంగా గురు పౌర్ణమి

భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు ● దర్శించుకున్న ప్రముఖులు ● భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు



పాములపాడు: జూటూరులో సాయినాథుడిని దర్శించుకుంటున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య



పగిడ్యాల: నెహ్రూనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



జూపాడుబంగ్లా: తంగడంచలో..

నంద్యాల (కల్చరల్), జూలై 21: నంద్యాలలో వెలసిన పలు సాయిబాబా ఆలయాలలో ఆదివారం గురుపౌర్ణమి, వ్యాసపూర్ణమి పురష్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని సాయిబాబా ఆలయాలలో అన్నదానం చేశారు. నంద్యాల నాగులకుంట రోడ్డు, బొమ్మలసత్రం, చాబోలురోడ్డులో, జంబులా పరమేశ్వరి ఆలయం సమీపంలోని సాయిబాబా ఆలయాల్లో బాబాకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. సంజీవనగర్ లక్ష్మీవెంకటేశ్వరస్వామివారికి పంచామృత అభిషేకాలు, జంబులా పరమేశ్వరి ఆలయం, బొమ్మలసత్రం దగ్గరలోని సాయిబాబా ఆలయంలో హోమాలు, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలునిర్వహించారు. బైటిపేట చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఉన్న సాయిబాబా గుడి, జంబులా పరమేశ్వరీ దేవస్థానం ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయం, విశ్వనగర్, పొన్నాపురం కేసీ కెనాల్ వద్దగల, సాంబవరం దగ్గర ఉన్న సాయిబాబా గుడి, కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో తదితర ఆలయాలో గురుపౌర్ణమి వేడుకల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాములేటిస్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం భక్తులు గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా బాబా ఆలయాన్ని దేవాలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి దేవాలయంలో పూజరులతో కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం, సాయంకాల హారతి తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. షిరిడీ బాబా ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసులు, గీతాదేవి, రోహిని ఆధ్వర్యంలో పుణ్య దంపతుల ఆధ్వర్యంలో సాయి సత్యవ్రతం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయ ఆవరణ కిటకిటలాడింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కొణిదేల గ్రామానికి చెందిన వెంకట కృష్ణా, శ్రీదేవి దంపతులు బాబాకు మకర తోరణం బహూకరించారు. అలాగే సురేష్ నాయుడు అనే భక్తుడు బాబాకు కిరిటం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యే పూజలు: నెహ్రూనగర్‌లోని సాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందనజేశారు. అనతరం ఆలయ కమిటీ సభ్యులు విజేయుడు, లోకానందరెడ్డి ఎమెల్యేకు శాలువ కప్పి సత్కరించారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు హేమసుందరరాజు, రాగుల రామస్వామి, శ్రీనివాసులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ శివారులోని కేజీ రోడ్డుపై గల షిర్డీ సాయిబాబ ఆలయంలో పీఠాధిపతి శ్రీ రామనందస్వామి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయిబాబకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వివిధ రకాలు పుష్పాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. భక్తులకు పీఠాధిపతి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

● జూటూరులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య షిర్డీ సాయినాథుడిని దర్శించుకున్నారు. పీఠాధిపతి శ్రీ రామనందస్వామి ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, మధుకృష్ణ, హఫీజ్, హరిప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తంగడంచలోని సాయిబాబా దేవాలయంలో స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవం శోభాయమానంగా సాగింది. ఈ ఉత్సవంలో భాగంగా స్వామివారికి ప్రాతఃకాల సమయం నుంచే కాగడ హారతి, నవవిధ అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చనలు వంటి తదితర పూజా క్రతువులను సంప్రదాయబద్ధంగా చేపట్టారు. అలాగే ఆలయం వెలుపల ఉన్న హోమగుండం చుట్టూ భక్తులు ప్రదర్శనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయినాథుడికి ప్రత్యేక పూజలతోపాటు సాయిసత్య వ్రతం కూడా జరిపారు. కాగా గురుపౌర్ణమి వేడుకను పురస్కరించుకుని స్వామికి చేసిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ఆలయానికి విద్యుత్, పుష్పాలంకరణతో సుందరీకరించారు. ఆత్మకూరు పట్టణం నుంచే కాకుండా కొత్తపల్లి, పాములపాడు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

● గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం జిల్లాలో మరెక్కడ లేనివిధంగా ఆత్మకూరు పట్టణంలో జరిగిన షిర్డీసాయినాథుని రథోత్సవ క్రతువుతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. సాయిబాబా ఆలయం నుంచి మార్కెట్ యార్డు వీధి, కేజీ రోడ్డు మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి తిరిగి కేజీ రోడ్డు మీదుగా గౌడ్ సెంటర్‌కు చేరుకుని అక్కడి తిరిగి సాయిబాబా ఆలయం వరకు మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం సాగింది. రథోత్సవం కారణంగా కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై కొంతవరకు ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయంలోని సాయి మందిరంలో ఆదివారం ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సాయినాథుడి మూలవిరాట్‌కు ఉదయం అభిషేకాది క్రతువులు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేసి భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే మండల పరిధిలోని కరివేన గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలోని సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలోని సాయిబాబా దేవస్థానంలో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని సాయినాథుని మూలవిరాట్‌కు ఉదయం అభిషేకాది క్రతువులు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



నంద్యాల(కల్చరల్): నంద్యాలలో ఎన్ఎండీ ఫిరోజ్ పూజలు



నంద్యాల(కల్చరల్): నంద్యాలలో క్యూలో నిల్చున్న భక్తులు

మహానంది: మహానంది మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం అల్లీనగర్ సాయిబాబా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం హారతి సేవను నిర్వహించారు. అలాగే మండలంలోని బుక్కాపురం సమీపంలోని మాణికేశ్వరి మాతా జన్మదినం సందర్భంగా ఆలయంలో నిర్వహకులు చిన్న నాగన్న ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. గురుపౌర్ణమి పూజలను అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సుబ్బయ్య పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. కరిమద్దెల, చిందుకూరు, దుర్వేసి, గడివేములలోని సాయి బాబా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబాకు పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. సాయి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.



వెలుగోడులో..



ఆత్మకూరు(రూరల్): వెంకటాపురంలో..



ఆత్మకూరులో అన్నదానం



గడివేముల: కరిమద్దెల గ్రామంలో..

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



వెంకటాపురంలో శాకంబరి దేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

మహానంది, జూలై 21: మహానంది క్షేత్రంలో ఆషాడమాసం పౌర్ణమి పురష్కరించుకొని ఆదివారం ఘనంగా శాకంబరి ఉత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం ముఖమంటపం వద్ద దాతలు నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులకు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. వివిధ రకాల కూరగాయలతో పాటు పండ్లతో దాతలు కామేశ్వరీదేవి ఆలయంలోకి వచ్చారు. అనంతరం ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మతో పాటు అర్చకులు రాజరత్తయ్యబాబు వేదమంత్రాలతో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలతో పాటు కూరగాయలు పండ్లతో ప్రత్యేక అర్చనలను ఈవో తో పాటు దాతల చేత నిర్వహింపజేశారు. అనంతరం శాకంబరీ అలంకారంతో ఉన్న కామేశ్వరీదేవిని భక్తులు దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శశిధర్‌రెడ్డి, చల్లగాలి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మహానందిలోని కామేశ్వరీదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసంలో పౌర్ణమిని పురస్కరించుకుని రాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాది క్రతువులు నిర్వహించారు. అనంతరం కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకారంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళ భక్తులు భారీగా తరలి వచ్చి శాకాంబరి అమ్మవారిని దర్శించుకుని అక్కడ నిర్వహించే పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

శ్రీశైలంలో పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, జూలై 21: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి అలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న నిత్యకళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సుముఖి నృత్యాలయం బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మూషికవాహనం, లింగాష్టకం, హరహర శంభో, అర్ధనారీశ్వరం, భో..శంభో తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

ఎంపీ శబరికి శాఖల కేటాయింపు

నంద్యాల (నూనెపల్లె), జూలై 21: నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి సీఎం చంద్రబాబు నాయుడు వివిధ శాఖలను కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ విద్య మహిళాశిశు సంక్షేమం నైపుణ్య శిక్షణ స్వయం ఉపాధి కల్పన శాఖలను కేటాయించారు. తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి గా న్యాయం చేస్తానని శబరి ఆదివారం తెలిపారు. సీఎం చంద్రబాబుకు ఆమె కృతజ్ఞతలు చెప్పారు.

'నిధులు తక్షణమే విడుదల చేయాలి'

నందికొట్కూరు, జూలై 21: అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు అందిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.20 వేలు రెండు విడతలుగా మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులుకు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయడానికి పెట్టుబడులు అవసరం అవుతాయని, వాటి కోసం రైతులు ప్రైవేట్‌గా అప్పులు చేయాల్సి వస్తోందని అన్నారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కట్టపోగు సోమన్న, సుధాకర్, షేక్షావలి, సుధాకర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

నంద్యాల టౌన్, జూలై 21: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఆధార్ కార్డులు లేనివారికి, అడ్రస్‌ల మార్పు, అక్షర దోషాలు, తదితర వాటి సవరణకు అప్‌డేట్ ప్రక్రియను నిర్వహించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు ఉన్న 72,793 మందికి, 15 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాలలోపు ఉన్న 75,959 మందికి, 18 సంవత్సరాలు నిండిన వారు 7919 మందికి స్పెషల్ డ్రైవ్ క్యాంపు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి వెల్లడించారు.

7 బృందాలతో అప్‌డేట్ ప్రక్రియ

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 7 బృందాలతో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను స్పెషల్ డ్రైవ్ ద్వారా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకట బృందం 23వ తేదీన చాంద్‌బడా, 24న బాలాజీ కాంప్లెక్స్ శ్రీనివాసనగర్, 25న పద్మావతినగర్, 26న సరస్వతినగర్, 27న రెవెన్యూ క్వాటర్స్, గోపాల్‌నగర్ ప్రాంతాలకు సంబంధించిన ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ నిర్వహిస్తుంది. రెండో బృందం 23వ తేదీన ఎన్‌జీవోకాలనీ, 24వ తేదీన పొన్నాపురం, 25న రైతునగరం, 26న ఏకలవ్యానగర్, 27న ఎస్‌బీఐ కాలనీలలో నిర్వహిస్తుంది. మూడో బృందం 23వ తేదీన విశ్వనగర్, 24న నర్స్ క్వార్టర్స్, సాయిబాబానగర్, 25న దేవనగర్, 26న ఆర్ఎఫ్ రోడ్డు, సాధిక్ నగర్, 27న విద్యానగర్‌లో క్యాంపు నిర్వహించనున్నారు. నాలుగో బృందం 23న నూనెపల్లి హరిజనవాడ, 24న దేవనగర్ మసీదుసెంటర్, 25న బర్మషాల, విజయపురికాలనీ, 26న వీసీ కాలనీ, 27న ముల్లాన్‌పేట, 5వ బృందం 23న మూలసాగరం, 24న ఎంఎస్‌నగర్, 25న బొమ్మలసత్రం, 26న జ్ఞానాపురం, 27న ఊడుమాల్పురం, 6వ బృందం 23న సలీమ్‌నగర్, 24న రామనాథ్‌రెడ్డినగర్, 25న పప్పులబట్టి బజార్, 26న అనకలపేట, 27న మున్సిపల్ ఆఫీస్ ప్రాంతంలో క్యాంపు నిర్వహించనున్నారు. 7వ బృందం 23న నందమూరినగర్, 24న వైఎస్ నగర్, 25న రోజాకుంట, 26న తెలుగుపేట, 27న హరిజనవాడ ప్రాంతాల్లోని ఆయా సచివాలయాల పరిధిలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియన నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఎంపీఈవో మృతి

ఆత్మకూరు రూరల్, జూలై 21: ఆత్మకూరు పట్టణంలో ఎంపీఈవోగా విధులు నిర్వహిస్తున్న సావిత్రి బాయి (30) గుండెపోటుతో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా గుండె పోటుకు గురై నిద్రలోనే తుది శ్వాస విడిచారు. అయితే కొంత కాలం నుంచి ఆమెకు హృద్రోగ వ్యాధితో బాదపడుతున్నారు. బాలమ్మ బాయి, మూర్తనాయక్ దంపతులకు నలుగురు ఆడపిల్లలు కాగా సావిత్రి బాయి నాలుగో సంతానం. సావిత్రి బాయి వ్యవసాయశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఆమె తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపీఈవోల సంఘం అధ్యక్షుడు ఇమ్రాన్, కార్యదర్శి శివశంకర్‌నాయక్, రవిగౌడ్ మాట్లాడుతూ సావిత్రి బాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కళాకారులకు సన్మానం



గాయని దాసరి పార్వతిని సన్మానిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల, జూలై 21: కొలిమిగుండ్లలోని షిరిడీ సాయిబాబా మందిరంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన కళాకారులను భూగర్భ గనుల శాఖ రాష్ట్ర మాజీ డైరెక్టర్ డా. విడి రాజగోపాల్ ఘనంగా సన్మానించారు. బుల్లి తెర ప్రముఖ గాయని దాసరి పార్వతి పాటల కచేరి అనంతరం ఆమెను సన్మానించి, రాయలసీమ గాన కోకిల బిరుదుతో సత్కరించారు. అదేవిధంగా ఆకాశవాణి కడప కేంద్రం రేడియో ఆర్టిస్ట్ జి. రమాదేవి కవితలతో అలరించారు. అనంతరం ఆమెను కూడా సన్మానించారు. హైదారాబాదుకు చెందిన ప్రముఖ గాయకులు డా. రవీంద్రబాబు, నోరి రఘురామమూర్తి, నోరి వెంకటహేమ కళ్యాణి తదితరుల గాన కచేరి అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో విడి రామక్రిష్ణ, దినేష్, నరేన్, విష్ణు, సత్యాల్‌రెడ్డి, ఎఎల్ క్రిష్ణారెడ్డి, రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

శిరివెళ్ల, జూలై 21: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో రాజాభైగారి షేకూన్‌బీకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మట్టి మిద్దె పైకప్పు శనివారం రాత్రి కూలింది. ఇంటి యజమానురాలు షేకూన్‌బీ ఇంటి ముందున్న వరండాలో నిద్రిస్తున్న సమయంలో మట్టి మిద్దె పైకప్పు కూలిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నివాస గృహం కూలిపోవడంతో ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు షేకూన్‌బీ కోరారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

కోవెలకుంట్ల, జూలై 21: మండల పరిధిలోని వెలగటూరి గ్రామంలో టీడీపీ నాయకులు ధనుంజరెడ్డి సహకారంతో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులకు, అధికారులకు విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరిందని చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. టీడీపీ అధికారంలోకి రావడంతో వెలగటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధనుంజయుడు స్పందించాడు. తన సొంత నిధులతో స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ కాలేజీలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చాగలమర్రి, జూలై 21: చాగలమర్రి ఎయిడెడ్ వాసవీ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన హోలిస్టిక్ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు త్రిశూలిరెడ్డి, భావనలు రోగులకు ఏకో, ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాబుద్దీన్, శిబిరం నిర్వాహకులు సాంబశివరావు, సతీష్, కరిముల్లా, వైద్య సిబ్బంది తిరుమలేష్, ఉష, శిరీష, శృతి పాల్గొన్నారు.

ముళ్ల పొదలతో కేసీ ప్రధాన కాలువ



చాగలమర్రిలో శిథిలావస్థలో పంట కాలువ

చాగలమర్రి, జూలై 21: చాగలమర్రిలోని కేసీ ప్రధాన కాలువ కింద ఆయకట్టుకు నీరందించే పంట కాలువలు దెబ్బతిన్నాయి. పంట కాలువలు ముళ్ల కంపలతో నిండుకున్నాయి. ప్రధాన కాలువ నుంచి ఆయకట్టుకు నీరందించే పంట కాలువ లైనింగ్ లేక నీరు వృథాగా పోతోంది. చివరి ఆయకట్టు వరకు కాలువలు సరిగా లేక పోవడంతో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాదైనా కేసీకి నీరు విడుదల చేసేందుకు పంట కాలువ మరమ్మతులు చేసి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పుట్టాలమ్మకు పూజలు

ఆళ్లగడ్డ, జూలై 21: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు భక్తులు ఆదివారం పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకొని కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

అసంపూర్తిగా అదనపు గది నిర్మాణ పనులు

రుద్రవరం, జూలై 21: మండలంలోని నాగులవరం గ్రామంలో అసంపూర్తిగా అదనపు గది పనులు నిలిచిపోయాయి. ఈ పాఠశాలలో ఒక్కటి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతల రహదారులతో ఇక్కట్లు

రుద్రవరం, జూలై 21: మండలంలో కురుస్తున్న వర్షాలతో గుంతలమయమైన రహదారులు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పెద్దతంబలూరు దక్షణకొట్టాల శ్రీరంగాపురం, కోటకొండ, బి. నాగిరెడ్డిపల్లె, పేరూరు, చిన్నకంబలూరు, అప్పలపల్లె గ్రామాల మధ్య రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు తీవ్ర పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



ఉయ్యాలవాడలో పూజలు చేస్తున్న మహిళలు



కోవెలకుంట్ల షిరిడి సాయిబాబా ఆలయంలో అన్నదానం

ఆలయాల్లో గురు పౌర్ణమి పూజలు



ఆళ్లగడ్డ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే అఖిలప్రియను ఆశీర్వదిస్తున్న వేదపండితుడు



కొలిమిగుండ్లలో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న రిటైర్డ్ స్టేట్ డైరెక్టర్ రాజగోపాల్



చాగలమర్రి సాయిబాబా ఆలయంలో సాయి వ్రతం చేస్తున్న మహిళలు



బనగానపల్లె సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, జూలై 21: చాగలమర్రిలో గురు పౌర్ణమి వేడుకలను సాయి సేవకులు వైభవంగా ఆదివారం నిర్వహించారు. సాయి చిత్రపటాలు, పాదుకలతో గ్రామోత్సవం చేశారు. అనంతరం ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో సాయివ్రతం, ధుని హోమ పూజ, గురుపూజ, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయినాథ పల్లకి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుంకు జనార్దన్, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, శివప్రసాద్, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉయ్యాలవాడలో కుందూ నది ఒడ్డున వెలసిన వేణుగోపాల స్వామి ఆశ్రమంలో అవధూత వెంకట సుబ్బారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పుచ్చకాయపల్లెలోని సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె, వెంకటాపురం తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు తెల్లవారుజాము నుంచే సాయిబాబా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి గురు చరిత్ర పారాయణం చేశారు. ఆలయాల వద్ద భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతోపాటు భోజన వసతి కల్పించారు.

దొర్నిపాడు: గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. దొర్నిపాడులో షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు సాయి సేవకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కేసీ కెనాల్ సమీపంలో అవధూత కాశిరెడ్డినాయనకు భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయినాథుడు విగ్రహానికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు సాయినాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

● మండలంలోని కొండమాయపల్లె రుద్రవరం, యల్లావత్తుల గ్రామాల్లో ఆధివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, కుంకులమ్మ అమ్మవార్లకు బోనాలు, చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని గుంజలపాడు రహదారిలో ఉన్న షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ప్రజలు తలంటు స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి సాయిబాబా దేవాలయానికి వచ్చి షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకలకు అనంతరం షిరిడీ సాయిబాబాను ప్రత్యేక రథంపై పట్టణంలో ఊరేగించారు. పట్టణంలోని ప్రధాన రహదారి అయిన జమ్మలమడుగు రోడ్డు నుంచి గ్రామ పంచాయతీ, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ముదిగేడు రోడ్డు సర్కిల్, బనగానపల్లె రోడ్డు సర్కిల్ మీదుగా ప్రధాన వీధుల గుండా షిరిడి సాయిబాబాను ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన చెక్కభజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మెన్ గడ్డం నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల, ఎర్రగుడి, అంకిరెడ్డిపల్లె, ఇటిక్యాల గ్రామాల్లో గురుపౌర్ణిమ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాయిబాబా, కాశిరెడ్డి నాయనస్వామి, గీతాశ్రమంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కొలిమిగుండ్లలో పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మాజీ డైరెక్టర్ విడి రాజగోపాల్, రామక్రిష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బాబాకు విశేష అభిషేకాలు నిర్వహించి, భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యాక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు దంపతులను రాజగోపాల్ ఘనంగా సన్మానించారు. ఎర్రగుడి సాయిబాబా ఆలయంలో కళాకారులు నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

అవుకు: మండలంలోని ప్రజలు గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా ఆదివారం జరుపుకున్నారు. మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన సాయినాథుడి ఆలయంలో ఉదయం అభిషేకాలు, అలంకరణ, చెక్కభజన కోలాటాల మధ్య సాయినాథుడి గ్రామోత్సవం, మధ్యాహ్న హారతి, భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం సంధ్యా హారతి, పల్లకీసేవ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి సాయినాథుడిని దర్శించుకొని పూజలు చేశారు.

బనగానపల్లె: మండలంలోని ప్రజలు గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా ఆదివారం జరుపుకున్నారు. అవుకు మెట్ట సమీపంలోని సాయి ఆలయం, యాగంటిపల్లె సమీపంలోని సాయి ఆలయాల్లో పూజలు చేసేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. అలాగే రవ్వలకొండపై వెలసిన వీరప్పయ్య దేవస్థానంలో గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● ప్యాపిలి పట్టణానికి చెందిన ప్రకృతి వైద్యులు, తిరుపతి, తిరుమల ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ దేవీదయానంద్‌సింగ్‌కు శ్రీశివాజీ మహారాజ్ హైందవ శ్రేష్ఠ పురస్కారం లభించింది. ఆదివారం కర్నూలులో టీజీ లలిత కళాపరిషత్‌లో వ్యాస మహాపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన హిందూ ఉపాధ్యాయుల సమావేశంలో ప్రముఖులు ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, పలువురు తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని విశ్రాంత ప్రిన్సిపాల్ భగవాన్ అన్నారు. ఆదివారం చాగలమర్రి భారతీ విద్యామందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉత్తమ గురువు కృష్ణమూర్తిని ఉపాధ్యాయులు సన్మానించారు. గురువును పూజించడం విద్యార్థుల బాధ్యత అన్నారు. తల్లిదండ్రుల తరువాత గురువే ప్రధానం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సుబ్బారావు, సీఆర్పీ అమీర్ ఖాన్, హెచ్‌ఎం ప్రసాదు, కాంతారావు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంవినగర్‌లో వెలసిన సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే అఖిలప్రియ ఆదివారం పూజలు చేశారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆమె దేవాలయానికి వెళ్లగా వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమెచే సాయిబాబాకు పూజలు చేయించి శాలువా, పూలమాలలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

మళ్లీ పైపైకి..

● పెరుగుతున్న కూరగాయల ధరలు
● రూ.80కి చేరిన టమోటా, పచ్చిమిర్చి
● కొనలేకపోతున్న సామాన్య ప్రజలు

కొలిమిగుండ్ల, జూలై 21: నిన్న మొన్నటి వరకు కాస్త తగ్గినట్టనిపించిన కూరగాయల ధరలు మరోసారి మళ్లీ పైపైకి ఎగబాకుతున్నాయి. దీంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. గత రెండు వారాల క్రితం సెంచరీని క్రాస్ చేసిన టమోట, పచ్చిమిర్చి కూరగాయల ధరలు రూ.120, 140 వరకు చేరుకొని వినియోగదారులకు అందని ద్రాక్షలా మారాయి. అయితే ప్రభుత్వ అప్రమత్తత, అధికారుల జోక్యంతో కాస్త తగ్గు ముఖం పట్టిన కూరగాయల ధరలు రూ.30, 40కి చేరుకున్నాయి. దీంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ సంతోషం వినియోగదారులకు ఎన్నో రోజులు మిగలకుండానే నాలుగైదు రోజులుగా కూరగాయల ధరలు మళ్లీ పైకి లేస్తున్నాయి. రెండు రోజులుగా జిల్లాలోని బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. టమోటా నాణ్యతను బట్టి రూ.70, 80 విక్రయిస్తుండగా, పచ్చిమిర్చి రూ.80కి విక్రయిస్తున్నారు. మిగిలిన ఏరకం కూరగాయ చూసినా వంద పైమాటేనని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. వంటింట్లో ప్రధాన అవసరమైన పచ్చిమిర్చి, టమోటా ధరలు ఆకాశాన్నంటడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా మిగిలిన కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్లో ఈవిధంగా ఉన్నాయి.





వంకాయ రూ.100
ఆలుగడ్డ రూ.60
దొండకాయ రూ.80
బెండకాయ రూ.100
బీరకాయ రూ.140
బీన్స్ రూ.240
క్యాప్సికమ్ రూ.140
క్యాలీ ఫ్లవర్ రూ.120

ఇలా ఏ కూరగాయలు చూసినా ధరలు భయపడిపోయో పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ప్రారంభమైన కూరగాయల ధరలు అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్నాయని వాపోతున్నారు. దళారుల ప్రమేయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సామాన్య, మధ్యతరగతి ప్రజలు కోరుతున్నారు.

కొనలేకపోతున్నాం



కూరగాయలు కొలేకపోతున్నాం. ధరలు చూస్తుంటే గుండెలు గుభేల్‌మంటున్నాయి. పించన్ సొమ్ముతో నెట్టుకొస్తున్నా. కూరగాయల ధరలు పెరిగి పోవడంతో కొనలేకపోతున్నా.

\- నరసమ్మ, కొలిమిగుండ్ల

ధరలను నియంత్రించాలి



కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో మాలాంటి పేద కుటుంబాల వారు కొని తినలేని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యానికి మంచి చేసే కూరగాయలు ఇలా పెరగడం ఇబ్బందికరం. ధరలను నియంత్రించాలి

\- బాలరంగయ్య, అంకిరెడ్డిపల్లె

పొంగి ప్రవహిస్తున్న రాజోలి ఆనకట్ట



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, జూలై 21: చాగలమర్రి మండలంలో ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నది పొంగి ప్రవహించింది. ఐదు వేల క్యూసెక్కుల నీటితో ఎగువ నుంచి వరద నీరు ఆనకట్టకు చేరింది. ముందస్తుగా కేసీ కాలువ ప్రధాన గేట్లు మూసి వేసి ఆనకట్ట వద్దగల కుందూ వైపు గేట్లను ఎత్తి కడప జిల్లా వైపు నీటిని విడుదల చేశామని ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఎగువ నుంచి వరద నీరు రావడంతో ఆనకట్టపై వరద నీరు పొంగి ప్రవహించిందని అన్నారు. మరో రెండు రోజుల్లో వరద నీరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కుందూ పరిసర గ్రామ ప్రజలు, రైతులు నది దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముత్యాలపాడు ఎస్పీజీ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

చాగలమర్రి, జూలై 21: మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో చదివిన 2002-2003 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం, హైదారాబాదు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 21 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెట్ సంజీవబాబు, హెచ్ఎం నళిని ప్రియదర్శిని, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.